# డిఎస్‌సి 2023 నోటిఫికేషన్ రద్దు




4లో.

RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
KKR NEWS
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

సంపుటి - 1 సంచిక - 156 గురువారం 29 ఫిబ్రవరి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఓఆర్ఆర్ టు ఆర్ఆర్ఆర్
# రేడియల్ రోడ్లు

- హెచ్ఎండీఏ, పురపాలక శాఖ అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష
- మాస్టర్ ప్లాన్ 2050కి అనుగుణంగా విజన్ డాక్యుమెంట్ రూపొందించాలని సూచన
- ఓఆర్ఆర్ లోపల ప్రాంతాలను ఒకే యూనిట్‌గా అభివృద్ధి చేయాలన్న సీఎం



**ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త):**
ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ రేడియల్ రోడ్లకు సంబంధించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో హెచ్ఎండీఏ, పురపాలక శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ రోడ్లకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ 2050కి అనుగుణంగా విజన్ డాక్యుమెంట్ రూపొందించాలన్నారు. ఓఆర్ఆర్ లోపల ప్రాంతాలను ఒకే యూనిట్‌గా అభివృద్ధి చేయాలన్నారు. ఓటర్, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాలను హెచ్ఎండీఏ పరిధిలోకి తేవాలని సూచించారు.

## బండి సంజయ్ కాన్వాయ్‌పై
# కోడిగుడ్ల దాడి...



- ముల్కనూరు బయలుదేరుతుండగా వంగరలో కోడిగుడ్ల దాడి
- బండి సంజయ్ కాన్వాయ్‌లోని మీడియా కాన్వాయ్‌పై కోడిగుడ్లు
- దాడి చేసినా పట్టించుకోవడం లేదని, తనకు పోలీస్ సెక్యూరిటీ అవసరం లేదని సంజయ్ ఆగ్రహం

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్రలో బుధవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో ఆయన కాన్వాయ్‌పై కోడిగుడ్లతో దాడి చేశారు. వంగరలో దివంగత పీవీ నరసింహారావు ఇంటిని సందర్శించిన అనంతరం ఆయన ముల్కనూరు బయలుదేరారు.

మిగతాది 2లో...

## రేవంత్ రెడ్డి
# భాషను ఖండిస్తున్నాం

: బీఆర్ఎస్ నేత బాల్క సుమన్
కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, హామీలను నమ్మి ఓట్లు వేస్తే ప్రజలకు శఠగోపం పెట్టారని విమర్శ
90 లక్షల రేషన్ కార్డుదారులకూ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్
రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటిస్తే కాంగ్రెస్ పార్టీకి కనీసం ప్రతిపక్ష హెూదా కూడా రాదని ఎద్దేవా



2లో.


## నిమిషం నిబంధనలో
# ఆగమాగం..



తొలి రోజు ప్రశాంతం
ముగ్గురు విద్యార్థుల డిబార్
ప్రత్యేక చర్యలు తీసుకున్న ఆర్టీసీ..
పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

# కవిత పిటిషన్‌పై విచారణ వాయిదా

**ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త):**
బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు మార్చి 13కు వాయిదా వేసింది. విచారణకు తగిన సమయం లేదంటూ మరో తేదీని కేటాయించింది. ఢిల్లీ మద్యం కేసులో ఈడీ ఇచ్చిన సమన్లను రద్దు చేయాలని కవిత సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై ఈడీ చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని ఆ పిటిషన్‌లో కోరారు.అయితే ఈ రోజు కోర్టు సమయం ముగియడంతో కవిత తరఫు న్యాయవాది కపిల్ సిబాల్ ప్రత్యేకంగా ఈ పిటిషన్‌ను ప్రస్తావించారు. త్వరగా విచారణ జరపాలని సర్వోన్నత న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. అయితే విచారణకు సమయం లేదంటూ మార్చి 13వ తేదీకి వాయిదా వేసింది.



## తెలంగాణలో మోదీ
# రెండు రోజుల పర్యటన..
### 17 సీట్లు గెలవడమే లక్ష్యం

**ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త):**
పార్లమెంటు ఎన్నికల్లో 370 సీట్లను బీజేపీ గెలుస్తుందని ప్రధాని మోదీ లోక్ సభలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇదే టార్గెట్ తో బీజేపీ లోక్ సభ ఎన్నికలకు సమాయత్తమవుతోంది. తెలంగాణలో సైతం మొత్తం 17 సీట్లను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో బీజేపీ ముందుకు సాగుతోంది. ఇప్పటికే రాష్ట్ర బీజేపీ నేతలు ఎన్నికల ప్రచారంలో తలమునకలై ఉన్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించబోతున్నారు. మార్చి 4, 5 తేదీల్లో రెండు రోజులపాటు ఆయన పర్యటన కొనసాగనుంది. ఆదిలాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో మోదీ పర్యటిస్తారు. వాస్తవానికి మార్చి 4వ తేదీన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా తెలంగాణలో పర్యటించాల్సి ఉంది. అయితే మోదీ పర్యటన నేపథ్యంలో ఆయన పర్యటన రద్దయింది.

మోదీ పర్యటన వివరాలు:

మార్చి 4న ఆదిలాబాద్ జిల్లాలో పర్యటన. పలు అభివృద్ధి



పనులకు శంకుస్థాపన. ఆదిలాబాద్ లో బహిరంగసభ.
మార్చి 4 రాత్రి హైదరాబాద్ లోని రాజ్ భవన్ లో బస.
మార్చి 5న సంగారెడ్డి జిల్లాలో పర్యటన. సంగారెడ్డిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన. ఆ తర్వాత బహిరంగసభ. అనంతరం ఢిల్లీకి తిరుగుపయనం.

## జార్ఖండ్ లో ఘోర
# రైలు ప్రమాదం

ట్రాక్ దాటుతుండగా ఢీకొట్టిన రైలు... 12 మంది మృతి
జాంతారలోని కాలా ఝురియా రైల్వే స్టేషన్ వద్ద దుర్ఘటన
ప్రమాదం విషయం తెలియగానే ఘటనాస్థలికి చేరుకున్న వైద్య సిబ్బంది, అంబులెన్స్‌లు

**ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త):**
జార్ఖండ్ లో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో 12 మంది మృతి చెందిన విషాద సంఘటన చోటు చేసుకుంది. జాంతారలోని కాలా ఝురియా రైల్వే స్టేషన్ వద్ద ఈ దుర్ఘటన జరిగింది. ప్రాథమికంగా పన్నెండు మంది మృతి చెందినట్లుగా తెలుస్తోంది. అధికారులు దీనిని ధ్రువీకరించాల్సి ఉంది. ప్రమాదం విషయం తెలియగానే వైద్య సిబ్బంది, అంబులెన్స్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నాయి. కొంతమంది రైల్వే ట్రాక్ దాటుతుండగా అంగా ఎక్స్‌ప్రెస్ రైలు వేగంగా వచ్చి వారిని ఢీకొట్టింది. పన్నెండు మంది మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉంది. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.



# బండి సంజయ్ కాన్వాయ్‌పై కోడిగుడ్ల దాడి...

**ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త):**
బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్రలో బుధవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో ఆయన కాన్వాయ్‌పై కోడిగుడ్లతో దాడి చేశారు. వంగరలో దివంగత పీవీ నరసింహారావు ఇంటిని సందర్శించిన అనంతరం ఆయన ముల్కనూరు బయలుదేరారు. ఈ సమయంలో ఇద్దరు వ్యక్తులు కోడిగుడ్లు విసరడంతో అవి కాన్వాయ్‌లోని మీడియా వాహనంపై పడ్డాయి. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. నిన్న కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోనూ ప్రజాహిత యాత్రను అడ్డుకునేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించారు.





### పోలీసులను వెళ్లిపోమన్న బండి సంజయ్

తమపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసే ప్రయత్నం చేసినప్పటికీ పోలీసులు నిమిత్తమాత్రంగా ఉండిపోయారని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఇక్కడి నుంచి వెళ్లిపోండి... దాడి చేస్తే మీరు చూడటం తప్ప ఏమీ చేయడం లేదు... మీరు (పోలీసులు) నాకు అవసరం లేదు... మీరు వెళ్లిపోండి... మాకు రక్షణ ఇవ్వడం లేదు... కానీ పాపం కానిస్టేబుళ్లు ఎండలో ఇబ్బంది పడుతున్నారు... మాకు మీ రక్షణ అవసరం లేదు' అని పోలీసు అధికారులతో బండి సంజయ్ చెప్పారు. పోలీసుల సమక్షంలో గుడ్లతో దాడి జరిగితే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. 'నాకు మీ భద్రత అక్కరలేదు... పోలీసులు నాతో రావొద్దు... మా కార్యకర్తలు చూసుకుంటారు' అని చెప్పారు. మీ సెక్యూరిటీ మాకు అవసరమే లేదంటూ అక్కడి నుంచి ఆయన వెళ్లిపోయారు.

### పొన్నం ఆదేశాల మేరకేనని ఆరోపణ

మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకే కాంగ్రెస్ కార్యకర్తలు దాడులకు తెగబడుతున్నారని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. పోలీసులకు ముందే సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు.

# రేవంత్ రెడ్డి భాషను ఖండిస్తున్నాం

**ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త):**
చేవెళ్ల బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ ఖండించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చేవెళ్ల సభలో సీఎం మాట్లాడిన భాషని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, హామీలను నమ్మి ఓట్లు వేస్తే ప్రజలకు శఠగోపం పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ఇస్తామని చెప్పిన గ్యారెంటీలు 90 లక్షల రేషన్ కార్డుదారులకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. కోటీ ఐదు లక్షల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు.రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటిస్తే కాంగ్రెస్ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జరిగిన చెల్లింపులపై శ్వేతపత్రం ఇచ్చే దమ్ముందా? అని ప్రశ్నించారు. మీరు అధికారంలోకి వచ్చాక ఏ కంపెనీలకు డబ్బులు చెల్లించారు? గుత్తేదారులకు చేసిన చెల్లింపులపై శ్వేతపత్రం ఇవ్వగలరా? అని నిలదీశారు. అర్హులైన వారికి వెంటనే రైతుబంధు ఇవ్వాలన్నారు. మెగా డీఎస్సీ వేయడంతో పాటు నిరుద్యోగులకు భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# అయిదుగురు ఐఎఎస్ అధికారుల బదిలీ

హైదరాబాద్: తెలంగాణలో ఐదుగురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మెదక్ కలెక్టర్‌గా రాహుల్ రాజ్, ఆదిలాబాద్ కలెక్టర్‌గా రాజర్షిషా, కుమురంభీమ్ ఆసిఫాబాద్ కలెక్టర్‌గా స్నేహ శబరీశ్, హైదరాబాద్ అదనపు కలెక్టర్‌గా హేమంత కేశవ పాటిల్‌ను బదిలీ చేసింది. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా బి.హెచ్.సహదేవ్‌రావును నియమించింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 8 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, 32 డిప్యూటీ కలెక్టర్లు బదిలీ అయ్యారు.
జగిత్యాల అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పర్సా రాంబాబు ,హనుమకొండ అదనపు కలెక్టర్‌గా ఎ.వెంకట్‌రెడ్డి, సూర్యాపేట అదనపు కలెక్టర్‌గా బీఎస్ లత,ములుగు అదనపు కలెక్టర్‌గా సీహెచ్ మహేందర్,భద్రాద్రి కొత్తగూడెం అదనపు కలెక్టర్‌గా డి.వేణుగోపాల్ బదిలీ

# నిమిషం నిబంధనలో ఆగమాగం..

**తొలి రోజు ప్రశాంతం**
**ముగ్గురు విద్యార్థుల డిబార్**
**ప్రత్యేక చర్యలు తీసుకున్న ఆర్టీసీ..**
**పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్**

**ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్ : ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు(సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1) ప్రశాంతంగా ముగిసినట్లు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు వెల్లడించారు. బుధవారం జరిగిన పరీక్షకు 5,07,754 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 4,88,113 మంది హాజరయ్యారు. 19,641 మంది విద్యార్థులు హాజరు కాలేదు. కరీంనగర్, నిజామాబాద్, జనగామ జిల్లాల్లో మాల్ ప్రాక్టీస్ కేసులు ఒక్కొక్కటి చొప్పున నమోదు అయ్యాయి. ఇక ఇంటర్ బోర్డు నుంచి నల్లగొండ, మెదక్, జనగామ, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లాలకు అధికారులు వెళ్లి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు.



### నిమిషం నిబంధనలో ఆగమాగం..

విద్యార్థులు ఉదయం 8.45 గంటలకు సంబంధిత ఎగ్జామ్ సెంటర్‌లో ఉండాలి. ఉదయం 9 గంటల తర్వాత ఒక నిమిషం దాటినా ఎవరికి అనుమతి ఉండదు. ఇక ఈ ఏడాది 9,80,978 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 4,78,718 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం వారుండగా, 5,02,260 మంది విద్యార్థులు ఇంటర్ సెకండ్ ఇయర్ వాళ్లు ఉన్నారు. సెకండియర్ పరీక్షలకు హాజరయ్యే వారిలో 58,071 మంది ప్రైవేట్ విద్యార్థులున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పరీక్షల నిర్వహణకు 1,521 సెంటర్లను ఏర్పాటు చేశారు.

### ప్రత్యేక చర్యలు తీసుకున్న ఆర్టీసీ..


విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రాలలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇక.. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకుని రావొద్దని అధికారులు తెలిపారు. ఎగ్జామ్ సెంటర్ లలో నీటి, వైద్య సదుపాయం కల్పించారు.
మొబైల్స్?, ఎలక్ట్రానిక్? గ్యాడ్జెట్స్? నిరాకరణ..
పరీక్ష ప్రారంభమయ్యే 9 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించలేదు. చాలా ప్రాంతాల్లో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. దీని కోసం గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు.

### పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

ప్రతీ పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144వ సెక్షన్ అమలులో ఉంది. అంతేకాకుండా పరీక్ష కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను పోలీసు శాఖ మూసివేసింది. ప్రశ్నపత్రాలను సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే ఓపెన్? చేశారు. పరీక్షలకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయం హెల్ప్ లైన్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9603615652, 76710333232 సంప్రదించాలని తెలిపారు. ఇంటర్ పరీక్షల్లో ఒత్తిడిని ఎదుర్కోవడానికి టెలి మానస్ కార్యక్రమం లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫోన్ నెంబర్ 14416, 180091441655 కి కాల్ చేసి మానసిక నిపుణుల ద్వారా కౌన్సిలింగ్ పొందవచ్చని పేర్కొన్నారు.

# ఆవుల కొనుగోలులో రూ. 3 కోట్లు స్వాహా

## పశుసంవర్ధక శాఖలో మరో స్కాం






**ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ పశుసంవర్ధక శాఖలో రోజుకు స్కామ్ బయటపడుతోంది. మొన్న గొర్రెల కుంభకోణం బయటకు రాగా, తాజాగా మరో స్కామ్ వెలుగుచూసింది. ఆవుల కొనుగోలులో దాదాపు 3 కోట్ల రూపాయల నిధులను కాంట్రాక్టర్లు, పశుసంవర్ధక శాఖ అధికారులు తమ బినామీ ఖాతాలోకి మళ్లించినట్లు గుర్తించారు. ఆవుల కొనుగోలు అక్రమాలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. నిధులు స్వాహా అయినట్లు గుర్తించిన అధికారులు సంబందిత సిబ్బందిపై కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు..

### బినామీ అకౌంట్లకు మారిన డబ్బు..

ప్రభుత్వ నిధుల నుంచి 8.5 కోట్ల రూపాయలను గత ప్రభుత్వం విడుదల చేసింది.. ఆవులు అమ్మిన వ్యాపారులకు మాత్రం 4 కోట్ల రూపాయలు మాత్రమే అకౌంట్లో జమయ్యాయి.. మిగిలిన 4.5 కోట్ల రూపాయల బినామీ అకౌంట్స్ కి ముఠా సభ్యులు మళ్ళించారు. రైతులు నిలదీయడంతో ముఠా సభ్యులు కోటిన్నర రూపాయలను తిరిగి ఇచ్చారు. తమకు ఇంకా మూడు కోట్ల రూపాయలు పశుసంవర్ధక శాఖ నుంచి రావాలంటూ ఏసీబీ అధికారులకు పుంగనూరు ఆవుల రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ కేసును ఏసీబీ అధికారులు దర్యాప్తు చేశారు.. బినామీ పేర్లతో బ్యాంకుల నుంచి నగదు విత్ డ్రా చేసినట్లు తేల్చారు.. బినామీలను సైతం గుర్తించారు.. అలాగే ఈ స్కామ్ లో పశుసంవర్ధక శాఖాలోని పలువురు సిబ్బంది హస్తం ఉన్నట్లు గుర్తించారు.. దీంతో వారందరిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ కు రంగం సిద్ధం చేసుకుంటున్నారు ఎసిబి అధికారులు.

# పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలంగాణలో హిమాచల్ పరిస్థితి రాదని చెప్పలేం..

## లక్ష్మణ్ షాకింగ్ కామెంట్స్

**ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త):**
కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు బడ్జెట్ సరిపోదన్న లక్ష్మణ్
బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్ బుధవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలంగాణలో ఏం జరుగుతుందో చూడండి... చూద్దాం తెలంగాణ... కర్ణాటక అవుతుందో... హిమాచల్ అవుతుందో.. అంటూ ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణలో తుమ్మితే ఊడిపోయే ముక్కులా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. బుధవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలో ఉందన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై తిరగబడ్డారని తెలిపారు. అందుకే రాజ్యసభ ఎన్నికల్లో హిమాచల్‌లో కాంగ్రెస్‌పై అసహనంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు బీజేపీకి ఓటు వేసినట్లు చెప్పారు.



హిమాచల్ పరిస్థితి తెలంగాణలో రాలేదని చెప్పలేమన్నారు. రాబోవు రోజుల్లో రేవంత్ రెడ్డి పరిస్థితి దారుణంగా తయారవుతుందని హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న సీట్లు కేవలం 64 మాత్రమేనని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలంగాణలో ఏం జరుగుతుందో చూడండి అన్నారు. ఢిల్లీలో ఉండే కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంలా మారిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు మోసపూరిత వాగ్దానాలేనని మండిపడ్డారు. సుదీర్ఘ కాలం తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడం... ఉన్నపళంగా మంత్రులుగా కావడంతో ఆ పార్టీ నేతలు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు.తెలంగాణలోని పదిహేడు లోక్ సభ స్థానాలలోనూ తాము ఒంటరిగా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు గుర్రాలను బరిలోకి దింపుతున్నామన్నారు. ఇక పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. దేశంలో కాంగ్రెస్ పని అయిపోయిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు బడ్జెట్ సరిపోదని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీలు ఉచితమని చెప్పి ఇప్పుడేమో అర్హులు అని చెబుతున్నారన్నారు. బీజేపీ లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని... ఓడిపోవడంతో తమపై అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తెలంగాణ భాష క్లాసిక్

## అందరికీ నేర్పించాలి గవర్నర్ తమిళి సై

**ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ భాష 'క్లాసిక్ భాష' అని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. తెలంగాణ భాష మాట్లాడుతున్నప్పుడు చాలా ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. తెలుగు భాష, సంస్కృతి అంతటా వ్యాప్తి చెందాలన్నారు. రవీంద్ర భారతిలో నేడు జరిగిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవంలో గవర్నర్ పాల్గొన్నారు. పలు కోర్సుల్లో పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి పట్టాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలుగు భాషను ఇతర భాషలు మాట్లాడే ప్రజలందరికీ నేర్పించాలని పేర్కొన్నారు. ప్రగతి సాధించడానికి షార్ట్ కట్ ఏమీ ఉండదని, శ్రమనే ఆధారం అని చెప్పారు.'స్నాతకోత్సవం అనేది పెద్ద పండుగ. సమాజానికి కొత్తదనాన్ని అందించడం మన బాధ్యత. మాతృభాష మన జీవితంతో ముడిపడి ఉంటుంది. తెలంగాణ భాష క్లాసిక్ భాష. మాట్లాడుతున్నప్పుడు ఆనందాన్ని కలిగిస్తుంది. ప్రపంచంలో అనేక దేశాల్లో ఎంతో మంది తెలుగు వాళ్లు ఉన్నారు. ఈ తెలుగు భాష, సంస్కృతి అంతటా వ్యాప్తి చెందాలి. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పినట్టు ఎన్ఈపీ విద్యాలయాలు ప్రారంభించాలి. తెలుగులో మాట్లాడటం నాకు సంతోషంగా ఉంది. పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో ఇలాంటి పండుగ జరగడం ఎంతో ఆనందం, ఇది కన్నుల పండగగా ఉంది' అని తమిళిసై అన్నారు.'మాతృభాష మన జీవితంలో అవసరం. తెలుగు మాట్లాడే వాళ్లు ప్రపంచ దేశాల్లో వివిధ రాష్ట్రాల్లో ఉన్నారు. తెలుగు భాషను ఇతర భాషలు మాట్లాడే ప్రజలందరికీ నేర్పించాలి. తక్కువ ఖర్చుతో తెలుగు భాష పుస్తకాలను ప్రచురించి.. సామాన్య ప్రజలు కొని చదివే విధంగా ఉండాలి. నా మాతృభాష తమిళ్. నేను మా సోదర భాష తెలుగు మాట్లాడడం ఎంతో సంతోషంగా ఉంది. ' అని గవర్నర్ చెప్పుకొచ్చారు.



# ప్రజలకు త్రాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

## - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు





శాయంపేట, ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న వేసవికాలంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు త్రాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలల్లో సమస్యలపై ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు ప్రజా సమస్యలపై ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వచ్చే ఖరీఫ్ నాటికి జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న చెరువులు, కుంటలు మరమ్మత్తులు చేసి, రైతులకు సాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 37 మంది కళ్యాణలక్ష్మీ లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. అనంతరం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి భా పూలే పాఠశాలలో నిర్వహించిన సైన్స్ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**భూపాలపల్లి, ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త):** శాయంపేట మండలం ఆరెపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చుతుందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారెంటీలల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల విద్యుత్ సౌకర్యం, 500 వందల రూపాయలకే వంట గ్యాస్ అందిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ళు లేని ప్రతీ ఒక్కరికీ ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇస్తామని వెల్లడించారు. అన్నిగ్రామాల అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత పాలకుల కంటే భిన్నంగా అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు.

## సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన జడ్పీటిసి గొర్రె సాగర్



చిట్యాల, ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త): చిట్యాల మండలంలోని సైన్ పాక ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీటిసి గొర్రె సాగర్ హాజరైనారు. అనంతరం విద్యార్థులు వారి టాలెంట్ తో తయారు చేసిన పరికరాల ప్రదర్శన (సైన్స్ ఎగ్జిబిషన్) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గుల పోటీలు, క్విజ్ కాంపిటీషన్ ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఊర్మిళ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలను తిలకించి, ప్రతిభ కలిగిన విద్యార్థులుగా తయారు చేస్తున్న పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్, సైన్స్ ఉపాధ్యాయులు స్వాతి, రాజశేఖర్, ఉపాధ్యాయులు సుధాకర్, ప్రణీత, విజయశాంతి, లింగయ్య, సతీష్, శ్రీధర్, ఓదెలు, సిఆర్పి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాలను సందర్శించిన వరంగల్ పోలీస్ కమిషనర్



వరంగల్, ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త): ఇంటర్ పరీక్షలు ప్రారంభం కావడంతో పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులు తీసుకుంటున్న జాగ్రత్త చర్యలపై పోలీస్ కమిషనర్ పర్యవేక్షించారు. ఇంటర్ పరీక్షలను పురస్కరించుకొని పరీక్షా కేంద్రాల పరిసరాలపై పోలీసులు, ఇన్విజిలెటర్లు దృష్టి పెట్టాలని సూచించారు. సెక్షన్ 144 అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రజలు గుంపులు ఉండకూడదని అన్నారు. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదని సూచించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్షా కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలన్నారు. ముఖ్యంగా సిసి కెమెరాల పనితీరుపై సంబంధిత పరీక్షా కేంద్రం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద నిబంధనలను పాటిస్తూ అధికారులు, పరీక్ష కేంద్రాల నిర్వాహకులు బాధ్యతలను నిర్వర్తించాలని ఆదేశించారు.

## డీఎస్పీని కలిసిన మాజీ సర్పంచ్ అశోక్ రెడ్డి




భూపాలపల్లి, ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త): ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా భూపాలపల్లి నూతన డీఎస్పీగా సంపత్ రావు బాధ్యతలు చేపట్టారు. బుధవారం భూపాలపల్లి జిల్లా లక్ష్మారెడ్డి పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అశోక్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మొలుగూరి రాజు డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి స్వాగతం తెలిపారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం



వర్ధన్నపేట, ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు వద్ద గల ఐనవోలు మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ప్రయోగాలను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రతిభను కనబరిచి ప్రయోగాలను ప్రదర్శించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షించిన సిఐ




రాయపర్తి, ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండల పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమైయ్యాయి. నేపథ్యంలో పరీక్ష కేంద్రాన్ని వర్ధన్నపేట సీఐ జి. సూర్య ప్రకాష్, ఎస్సై వడ్డే సందీప్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వారి పరిధిలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షలు సజావుగా సాగేలా తమ పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించడం జరుగుతుందన్నారు. వారి వెంట ఏఎస్సై సదానందం, హెడ్ కానిస్టేబుల్ సురేష్, కానిస్టేబుల్ సంపత్ ఉన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన అరూరి



పర్వతగిరి, ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త): పర్వతగిరి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కొత్తూరి విమల ఇటీవల గుండె పోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మృతురాలి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. అధికారంలో ఉన్న లేకపోయినా వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పుడు రుణపడి ఉంటానని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు ఆయనను ఆశీర్వదించి, రెండు పర్యాయాలు ఎమ్మెల్యే పదవి బాధ్యతలను అప్పగించిన పరిస్థితులు మర్చిపోలేనివని తెలిపారు. ఆరు నూరైనా సరే వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ఏ కుటుంబంలో కష్టం వచ్చిన తాను కుటుంబ సభ్యునిగా ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ పరామర్శలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుని కుటుంబానికి బాల్య మిత్రుల ఆర్థిక సహాయం



రాయపర్తి, ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త): కలిసి చదువుకున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా సమాచారం తెలుసుకున్న బాల్య మిత్రులు బుధవారం ఆ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేశారు. వివరాల్లోకి వెళితే రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన గూడెల్లి శ్రీనివాస్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవారు. వృత్తిరీత్యా శ్రీనివాస్ ఆటో కిరాయికి వర్ధన్నపేటకు వెళ్ళి స్వగ్రామమైన మైలారం వస్తుండగా హెచ్ పి గ్యాస్ గోదాం ముందు ఆటోను ఆర్టీసీ బస్సు బలంగా ఢీ కొట్టింది. దీంతో ఆటో 2 ముక్కలుగా విడిపోయి, జరిగిన ప్రమాదంలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందారు. 94 - 95 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న బాల్య మిత్రులు విషాదంలో ఉన్న ఆ కుటుంబానికి పరామర్శించి, 31 వెయ్యి 2 వందల రుపాయల ఆర్థిక సహాయం అందించారు. వారితో పాటు పేదరికంతో శోకసంద్రంలో మునిగిపోయిన ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు దాతలు ముందుకొస్తున్నారు.

# సభా స్థలిని పరిశీలించిన బీజేపీ నాయకులు



వర్ధన్నపేట, ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త): మరోసారి భారత ప్రధాని నరేంద్రమోదీని గెలిపించాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా విజయ సంకల్ప యాత్ర ప్రారంభించారు. బుధవారం వర్ధన్నపేటలో విజయ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించబోయే సభ స్థలాన్ని బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవి కుమార్, యాత్ర ప్రముక్ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతి రెడ్డి, యాత్ర సహ ప్రముఖ్ కందిమళ్ళ మహేష్ పరిశీలించారు. వారి వెంట నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు నాంపెల్లి యకయ్య, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, హనుమకొండ జిల్లా నాయకులు పోనుగోటీ వెంకట్ రావు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, వర్ధన్నపేట రూరల్, పట్టణ, మండల అధ్యక్షులు రాయపురపు కుమారస్వామి, చీటూరి రాజు తదితరులు ఉన్నారు.

# విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



రాయపర్తి, ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలక దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థినీ విద్యార్థులు స్వయం పరిపాలక దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులైన వేళ విద్యార్థులకు ఆ మధుర క్షణాలు మర్చిపోలేని తీపి జ్ఞాపకంగా మిగిలిపోతాయి. ఈ సందర్భంగా విద్యార్థులు తరగతి గదులలో ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో గారె వర్ష, చందు, అస్మిత, ఈశ్వర్, రాజు, గౌతమ్, సంజయ్, ఖాజాబీ విద్యాశాఖ అధికారి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులుగా చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలు బోధిస్తున్న శైలిని ప్రధానోపాధ్యాయురాలు పాక పద్మావతి, ముదురుకోలా సతీష్ కుమార్, మామిడి కోమల, బి లక్ష్మి, ఏవీఆర్ చార్యులు, పరహత్ సుల్తానా పరిశీలించి, ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులను అభినందించారు.

# డిఎస్‌సి 2023 నోటిఫికేషన్ రద్దు

**ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గత ఏడాది ఇచ్చిన డిఎస్‌సి నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ రద్దు చేసింది. 2023లో 5,089 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు గత ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా, మొత్తం 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 2023 నవంబరు 20 నుంచి 30వ తేదీ మధ్యలో రాతపరీక్ష నిర్వహించాల్సి ఉండగా అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో పరీక్ష వాయిదా పడ్డాయి. తాజాగా పాత డిఎస్‌సి 2023 నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ రద్దు చేసింది.




డిఎస్‌సి కొత్త నోటిఫికేషన్ గురువారం వెలువడనుంది. విద్యా శాఖ ప్రతిపాదించిన 11,062 ఉపాధ్యాయ పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ మెగా డిఎస్‌సి విడుదల చేయనుంది. నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే దరఖాస్తుల ప్రారంభించనున్నారు. మే నెల మూడో వారంలో 10 రోజుల పాటు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిసింది. పాత నోటిఫికేషన్‌కు వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొనేలా సాఫ్ట్‌వేర్ రూపొందించారు. టీచర్ పోస్టుల సంఖ్య పెరగడంతో గత డిఎస్‌సి కన్నా పెరుగనున్న నేపథ్యంలో భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రశ్నపత్రాల రూపకల్పన మొదలు ఫలితాల వరకూ సాంకేతికతను వినియోగించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కొత్త డిఎస్‌సి నోటిఫికేషన్‌లో 1,016 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. ప్రాథమిక, ఉన్నత విద్య పాఠశాలల్లో ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించేలా ఈ పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. గతంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు డిఎస్‌సి ద్వారా భర్తీ చేయలేదు. కానీ ఈ నోటిఫికేషన్‌లో మాత్రం 1,016 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిసింది.

# రాష్ట్రపతి నిలయంలో ఘనంగా సైన్స్ డే ముగింపు వేడుకలు

**ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్ : బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నేషనల్ సైన్స్ డేని పురస్కరించుకుని ఫిబ్రవరి 26 నుండి 28 వరకు జరిగిన సైన్స్ డే వేడుకలలో మూడవ రోజు బుధవారం ఘనంగా ముగిసాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, భారతీయ విద్యాభవన్, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ పాఠశాలల నుండి, మల్కాజ్‌గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల, సెంట్ మార్టిన్స్ కళాశాల, ఆంధ్ర మహిళా సభ, సివిఆర్ కళాశాల, జి.నారాయణమ్మ ఇంజనీరింగ్ కళాశాల తదితర విద్యా సంస్థల నుండి వెయ్యి మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఎస్‌సి రిటైర్డ్ శాస్త్రవేత్త డా. చంద్రశేఖర్ ఇస్రో చేపట్టిన చంద్ర యాత్ర, చంద్రయాన్ ద్వారా కనుగొన్న చంద్రగ్రహ రహస్యాల గురించి, ఎన్ఆర్ఎస్‌సి పరిశోధనల గురించి విద్యార్థులకు వివరించి వారి సందేహాలను నివృత్తి చేశారు. సిసిఎంబి ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త డా.బిశ్వజిత్ పాల్ భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లోని విజ్ఞాన ఆవిష్కారాల గురించి వివరించారు.

జన విజ్ఞాన వేదిక నుండి రాజా సైన్స్ యొక్క ఆవశ్యకత గురించి వివరించారు. ఫిబ్రవరి 26న జరిగిన క్విజ్ పోటీలో ఆక్స్‌ఫర్డ్ పాఠశాల, జెడ్‌పిహెచ్ ఎస్ జీడిమెట్ల, జెడ్‌పిహెచ్ ఇర్విన్, బారతీయ విద్య భవన్. సివిఆర్ ఇంజనీరింగ్ కళాశాల, నిజాం



కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సెంట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల విదార్థులు విజేతలుగా నిలిచారు. వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఫిబ్రవరి 27న జరిగిన సైన్స్ ఎక్సిబిషన్ లో జెడ్‌పిహెచ్ఎస్ జీడిమెట్ల, మీరంపెట్, ఇర్విన్, మాడుల్. డాన్ హై స్కూల్, ఇండస్ యూనివర్సల్ స్కూల్ విద్యార్థులు, నారాయణమ్మ ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల- మల్కాభిరి, సెంట్ ఫ్రాన్సిస్, ఐటిటి కళాశాల బాలానగర్, ప్రభుత్వ %--% శామీర్‌పేట్, భవన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిట్స్ ఆకర్షణగా నిలిచాయి. వారికి బహుమతులు ప్రధానం చేశారు.

బుధవారం మూడోరోజు కార్యక్రమంలో ముఖ్య అతిదిగా పాల్గొన్న జిఎస్ఐ అదనపు డైరెక్టర్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఈ కార్య క్రమంలో భాగస్వాములైన విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లి తండ్రులు, పాఠశాల, కళాశాల నిర్వాహకులను అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న రాష్ట్రపతి నిలయం యజమాన్యాన్ని అభినందించారు. నేటి బాలలే రేపటి దేశానికి మార్గదర్శకులు. అవుతారని తెలిపారు. చంద్రయాన్-3 లో యువ, మహిళా శ్యాస్త్రవేత్తల పాత్ర ఉందని గుర్తు చేసారు. క్విజ్ పోటీలు, సైన్స్ ఎక్సిబిషన్ లో గెలుపొందిన విజేతలను అభినందించారు.

# రాష్టంలోని పేదలకు త్వరలోనే తెల్లరంగు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు

**ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలోని పేదలకు త్వరలోనే తెల్లరంగు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా, పాలేరు నియోజకవర్గంలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. తిరుమలాయపాలెం మండలం, మాదిరిపురంలో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న గిరిజన మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి మాటాడుతూ.. పదవులు, అధికారం శాశ్వతం కాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూం ఇళ్ళు ఇస్తాం అని చెప్పి వందల్లో మాత్రమే గత సిఎం కెసిఆర్ ఇచ్చారని, ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికీ ఇ ళ్ళు ఇస్తామన్నారు. గడిచిన 80 రోజుల్లో ప్రభు త్వం ఏం చేస్తుందో అంతా



చూస్తున్నారని, ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే నాలుగు హామీలను అమ లు చేశామని, ఉచిత బస్సు పథకం, రాజీవ్ ఆరోగ్యశ్రీలో 10 లక్షల పథకం, గ్యాస్, ఉచిత వి ద్యుత్ పథకాలను ఇప్పటికే ప్రారంభించామని అన్నారు. మిగిలిన గ్యారెంటీలు కూడా అమలు చేస్తామన్నారు. ప్రజా పాలనలో ఇచ్చిన దరఖాస్తుల్లో తప్పులు ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని, ఇది నిరంతర కార్యక్రమం అని తెలిపారు.

ధరణి పేరుతో గత ప్రభుత్వంలో వేలాది ఎకరాల భూములను కబ్జా చేశారని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వంలో ధరణిలో ఇచ్చిన దరఖాస్తులను తిరిగి వెనక్కి పంపించారని అన్నారు. ధరణిలో వచ్చిన రెండు లక్షల నలభై ఐదు వేల దరఖాస్తులను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. మహిళలకు రూ. 2500 భృతిని త్వరలోనే పంపిణీ చేస్తామని, తాము ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా నెరవేరుస్తామన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన నష్టాన్ని సరిదిద్దే పనిలో ఉన్నామని అన్నారు. మొన్నటి వరకు అధికారంలో ఉన్న ప్రభుత్వం రూ 7 లక్షల కోట్ల అప్పులు చేసిందని ధ్వజమెత్తారు. గత పాలకులు ప్రాజెక్టులను చిత్తశుద్ధితో కట్టామని చెపుతున్నారు తప్ప.. చేసిన తప్పులను ఒప్పుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా తిరుమలాయపాలెం మండలంలో కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకం కింద ఎంపికైన 30 మంది లబ్ధిదారులకు మంత్రి చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు కూసుమంచి క్యాంపు కార్యాలయంలో 19 మంది కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ లబ్ధిదారులకు కూడా చెక్కులను పంపిణీ చేశారు. ఆ తరువాత ఖమ్మం రూరల్ మండలం, వెంకటగిరి గ్రామంలో రూ. 2.65 కోట్ల వ్యయంతో నిర్మించనున్న గ్రీన్ ఫీల్ మినీ స్టేడియం నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు .ఈ సందర్భంగా ఖమ్మం రూరల్ మండల కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకం కింద ఎంపికైన 87 మంది లబ్ధిదారులకు కూడా మంత్రి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 59వ డివిజన్ దానవాయిగూడెంలో రూ. 3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు, సైడ్ డ్రెయిన్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిఓ 58 ద్వారా క్రమబద్ధీకరణ అయిన గృహాలకు ఇంటి నెంబర్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విపి గౌతమ్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి, జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దినేని బేబి స్వర్ణ కుమారి, రాంరెడ్డి చరణ్ రెడ్డి, నరేశ్ రెడ్డి, మల్లారెడ్డి, డా శివరామక్రష్ణ, జెడ్‌పిటిసి బెల్లం శ్రీను, ఖమ్మం రూరల్ ఎంపిపి బెల్లం ఉమా, ఆయా మండల తహశీల్లార్లు, ఎంపిడివోలు, సర్పంచ్‌లు , ఎంపిటిసిలు, జెడ్‌పిటిసి సభ్యులు పాల్గొన్నారు.

## మూడోసారి తండ్రి అయిన కేన్ మామ..
# ఆడబిడ్డకు జన్మనిచ్చిన సారా



న్యూజిలాండ్ మాజీ సారథి, అభిమానులంతా కేన్ మామ అని పిలుచుకునే కేన్ విలియమ్సన్ మూడోసారి తండ్రి అయ్యాడు. కేన్ భార్య సారా రహీం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని విలియమ్సన్ స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించాడు. ఈ జంటకు ఇప్పటికే ఓ బాబు, పాప ఉన్నారు. ఫిబ్రవరి 28న కేన్ మామ ముచ్చటగా మూడో బిడ్డకు తండ్రి అయ్యాడు. ఇన్‌స్టా వేదికగా విలియమ్సన్ స్పందిస్తూ%ేొ% 'ఇక ఇప్పుడు ముగ్గురు. అందమైన పాపాయికి ఈ ప్రపంచంలోకి స్వాగతం. ఈ లోకంలోకి జాగ్రత్తగా వచ్చినందుకు చాలా థ్యాంక్యూ. అద్భుతమైన ప్రయాణం ముందుంది..' అంటూ రాసుకొచ్చాడు. కేన్ మామ ఈ విషయం చెప్పగానే ఆ దంపతులకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. 2015 నుంచి రిలేషన్‌షిప్‌లో ఉంటున్న కేన్ సారాలు ఇప్పటివరకూ తమ పెళ్లిని అధికారికంగా ధ్రువీకరించలేదు. 2020లో ఈ జోడీకి పాప పుట్టగా 2022 మేలో బాబు పుట్టాడు. బాబు పుట్టినప్పుడు కేన్ మామ.. ఐపీఎల్ 2022లో బయో బబుల్ నుంచి వెళ్లిపోయిన విషయం విదితమే. ఇక తాజాగా స్వదేశంలో ఆస్ట్రేలియాతో ముగిసిన టీ20 సిరీస్‌కు మిస్ అయిన విలియమ్సన్.. ఫిబ్రవరి 29 నుంచి మొదలుకాబోయే రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు మాత్రం అందుబాటులో ఉండనున్నాడు. ఇటీవలే సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో అతడు.. వరుస మ్యాచ్‌లలో సెంచరీలు చేసిన విషయం తెలిసిందే.

## ప్రో కబడ్డీ లీగ్
# : ఫైనల్‌కు చేరిన రెండు జట్లు ..




దాదాపు మూడు నెలలపాటు అలరించిన 'ప్రో కబడ్డీ లీగ్'(పీకేఎల్) తుది దశకు చేరుకుంది. డిసెంబర్ 2 నుంచి 12 జట్ల మధ్య రసవత్తరంగా సాగిన ఈ పోరులో చివరికి రెండు జట్లు మిగిలాయి. హైదరాబాద్ వేదికగా బుధవారం జరిగిన సెమీస్‌లో హర్యానా స్టీలర్స్, పుణెరి పల్టాన్ జట్లు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాయి. పాట్నా పైరేట్స్‌తో జరిగిన తొలి సెమీఫైనల్‌లో పుణెరి పల్టాన్ 37-21 తేడాతో ఘన విజయం సాధించింది. పుణెరి కెప్టెన్ అస్లామ్ ముస్తఫా, రైడర్ పంకజ్ ఏడేసి పాయింట్లు తీసుకురాగా, ఆల్‌రౌండర్ మహ్మద్‌రెజా 5పాయింట్లతో ఫరవాలేదనిపించాడు. ఇక, పాట్నా పైరేట్స్ జట్టులో రైడర్ సచిన్ ఒక్కడే ఐదు పాయింట్లు సాధించాడు. మిగతా ఆటగాళ్లు అంతగా రాణించకపోవడంతో జట్టుకు ఓటమి తప్పలేదు. ఇక, ఇదే వేదికగా జరిగిన రెండో సెమీఫైనల్‌లో జైపూర్ పింక్ పాంథర్స్‌పై హర్యానా స్టీలర్స్ అద్భుత విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో నిర్ణీత సమయం ముగిసేసరికి హర్యానా 31 పాయింట్లు సాధించగా, జైపూర్ 27 పాయింట్లకే పరిమితమైంది. దీంతో నాలుగు పాయింట్ల తేడాతో హర్యానా స్టీలర్స్ విజయం సాధించి, ఫైనల్‌కు చేరుకుంది. హర్యానా ప్లేయర్లలో రైడర్ వినయ్ 11 పాయింట్లతో రాణించగా, శివమ్ పటారే(7), ఆశిష్(4) ఫరవాలేదనిపించారు. జైపూర్ ఆటగాళ్లలో రైడర్ అర్జున్ దేశ్వాల్ 14 పాయింట్లతో అదగొట్టినప్పటికీ, మిగతా జట్టు సభ్యులు అంతగా రాణించలేదు. దీంతో సెమీస్‌లో జైపూర్ ఓటమి పాలైంది. హైదరాబాద్ వేదికగానే పుణెరి, హర్యానా జట్ల మధ్య శుక్రవారం రాత్రి 8గంటలకు ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

## ట్రెడిషన్ లుక్కులో
# అనసూయ
## అందాల సెగలు..




యాంకర్ అనే పదానికి గ్లామర్ సరికొత్త అర్థాన్ని తీసుకువచ్చిన బ్యూటీ అనసూయ భరద్వాజ్. ఒకప్పుడు యాంకర్ అంటే మాటలతో టైమింగ్ పంచ్ లతో ఆకట్టుకునేవారు. కానీ అనసూయ ఎంట్రీ ఇచ్చిన తరువాత మరో ట్రెండ్ మొదలైంది. అమ్మడి అందానికి కుర్రాళ్లు ఫిదా అయ్యారు. పోటీగా ఎంతమంది గ్లామరస్ యాంకర్లు వచ్చినా ఆమెకు ధీటుగా మాత్రం నిలవడం లేదు. బుల్లితెర నుంచి ఆమె క్రేజ్ బిగ్ స్క్రీన్ కు చేరింది. నటనలోను అనసూయ కొత్త తరహా ట్రెండ్ ఫాలో అవ్వడం బాగా కలిసొచ్చింది. కేవలం రెగ్యులర్ పాత్రలు చేయకుండా పవర్ఫుల్ నెగిటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్ చేయడంతో ఆమెకు వరుసగా అవకాశాలు వస్తున్నాయి. ఒకప్పుడు కేవలం జబర్దస్త్ షో తోనే బిజీగా కనిపించిన అనసూయ ఆ తర్వాత వివిధ రకాల షోలు చేసింది. అనంతరం క్షణం సినిమాలో ఆమె చేసిన ఒక మంచి పాత్రతో కెరీర్ మలుపు తిరిగింది. పుష్ప సినిమాతో ఆమె క్రేజ్ ఏ స్థాయిలో పెరిగిపోయిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ముఖ్యంగా అంతకుముందు రంగస్థలం సినిమాలో రంగమ్మత్త పాత్ర కూడా ఆమె కెరీర్ కు మరింత బలాన్ని ఇచ్చింది. అనసూయ ఎక్కడికి వెళ్ళినా కూడా అందరూ రంగమ్మత్త అంటూ ముద్దుగా పిలుచుకుంటు ఉంటారు. అంతలా ఆ క్యారెక్టర్ ఇంపాక్ట్ చూపించింది. ఇక అనసూయ గ్లామర్ షో తో ఎప్పటికప్పుడు తన వయసును తగ్గించుకుంటూనే కనిపిస్తోంది. రీసెంట్గా ఆమె ఒకవైపు ట్రెడిషనల్ లుక్ తో కనిపిస్తూనే మరొకవైపు తన గ్లామర్ తో సోషల్ మీడియా ఫాలోవర్స్ మనసులను దోచేసింది. లంగా వోని లో స్పెషల్ ఫోటోషూట్ లో కనిపించిన అనసూయ భరద్వాజ్ నెవ్వర్ బిఫోర్ అనే విధంగా తన గ్లామర్ తో అట్రాక్ట్ చేసింది. తన చిరునవ్వుతో కూడా ఒక విధంగా మాయ చేసింది అని చెప్పవచ్చు. ఎండలో తన అందాల సెగలతో గతంలో ఇప్పుడు లేనంత గ్లామర్ తో దర్శనమిచ్చింది. ఇక ఈ ఫోటోలు నిమిషాల్లోనే వైరల్ అయిపోయాయి. సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం అనసూయ పుష్ప 2 సినిమాతో బిజీగా ఉంది. అలాగే ఒక రెండు లేడీ ఓరియంటెడ్ ప్రాజెక్టులు కూడా చేస్తోంది

# 'అంతరిక్షం' చిత్రానికి 50శాతమే పారితోషికం



మెగా బ్రదర్ నాగబాబు జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. నిర్మాతగా ఎన్నో సినిమాలు నిర్మించారు. హిట్ చిత్రాలతో పాటు ఫ్లాప్ చిత్రాలు చేసి నష్టాలు చూసారు. అలాగే క్యారెక్టర్ ఆర్టిస్ట్ గానూ కొనసాగు తున్నారు. అయితే నటుడిగా నాగబాబు ..చిరంజీవి అనుకున్న స్థానానికి చేరుకోలేదు అన్న అసంతృప్తి చిరులో కనిపించేది. చిన్న తమ్ముడు పవన్ కళ్యాణ్ క్లిక్ అయ్యాడు గానీ..నాగబాబు పెద్ద స్టార్ కాకపోవడంతో చిరు రెండవ తమ్ముడి విషయంలో కాస్త ఫీలయ్యేవారు. అయితే తండ్రి కాకపోయినా వరుణ్ తేజ్ మాత్రం ఇప్పుడు పెద్ద హీరో అవ్వడంతో చిరులో ఆ బెంగ ఇప్పుడు ఎక్కడా లేదు. మీ నాన్న కోరికను..ఆశని నువ్వు నెరవేర్చావ్ అంటూ చాలా సందర్భాల్లో అన్నారు. వరుణ్ హైట్ విషయంలో హీరోగా ఫిట్ అవుతాడా? లేదా? అన్న సందేహం కూడా చిరులో ఉండేది. కానీ డాన్సులు బాగా చేయడంతో అక్కడా వరుణ్ తేజ్ పాస్ అయ్యాడు. ఇప్పుడు వరుణ్ హీరోగా నిలదొక్కుకున్నాడు. బాగానే సంపాదిస్తున్నాడు. నాగబాబు ఇక సినిమాలు చేసినా..చేయికపోయినా పర్వాలేదు? అనే ధీమా కనిపిస్తుంది. నటుడిగా వరుణ్ గ్రాఫ్ అంతకంకు పెరుగుతుంది. కమర్శియల్ చిత్రాలతో పాటు ప్రయోగాలు చేసి నతకంటూ ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నాడు. అయితే తాజాగా వరుణ్ తేజ్ తన మనసులో ఉన్న ఓ విషయాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో బయట పెట్టాడు.' ప్రతీ సినిమా డబ్బు కోసం చేయకూడదు. అంతరిక్షం సినిమాకి ముందు ప్రతీ సినిమాకి వంద శాతం పారితోషికం తీసుకున్నాను. కానీ'అంతరిక్షం' చిత్రానికి **50**శాతమే తీసుకున్నాను. మిగతా డబ్బు సినిమా కోసం ఖర్చు చేయమని చెప్పాను. ఇంత తీసుకోమని నాకు నిర్మాతగానీ..దర్శకుడు కానీ చెప్పలేదు. ఆ సినిమాకి అంతే తీసుకోవాలి అని నాకు నేనుగా అనుకున్నాను. కొన్ని సినిమాలు అలా ప్రభావితం చేస్తుంటాయి. వాణిజ్య పరంగా సినిమాకి గట్టి దెబ్బ తగిలితే పారితోషికం తగ్గించుకోవడమో..పూర్తిగా తీసుకోకుండా ఉండటమో చేస్తాను. ఆ సందర్భం వచ్చినా తట్టుకునే శక్తి నా దగ్గర ఉంది. నటుడిగా నాపై నాకున్న నమ్మకం అది' అన్నాడు. మొత్తానికి ఓ నిర్మాత కొడకు నిర్మాత కోణంలో ఆలోచించి మంచి నిర్ణయం తీసుకున్నాడని చెప్పొచ్చు.

## జక్కన్న, మహేష్..
# ఇది ఫస్ట్ టాస్క్



ఆర్ఆర్ఆర్ తర్వాత చాలా గ్యాప్ తీసుకున్న రాజమౌళి ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబుతో సినిమా చేయడానికి రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్ తో పాన్ వరల్డ్ రేంజ్ లో ఈ సినిమా తెరకెక్కనుంది. విజయేంద్రప్రసాద్ స్క్రిప్ట్ కి తుది మెరుగులు దిద్దుతున్నారు. జక్కన్న కూడా ఈ స్క్రిప్ట్ మీద వర్క్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే స్క్రిప్ట్ లాక్ అయిన వెంటనే జక్కన్న వర్క్ షాప్ స్టార్ట్ చేయనున్నాడంట. సుమారు రెండు నెలల పాటు మూవీకి సంబంధించిన వర్క్ షాప్ నిర్వహించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ వర్క్ షాప్ లో భాగంగా మొదటి మూడు వారాలు ఆర్ట్స్ డైరెక్టర్, కెమెరామెన్ లతో జక్కన్న షూటింగ్, లొకేషన్స్, సెట్ వర్క్, విజువలైజేషన్ కి సంబంధించిన డిస్కషన్ ఉంటుందంట. తరువాత మహేష్ బాబు వర్క్ షాప్ లో జాయిన్ అవుతారని టాక్. మహేష్ పై టెస్ట్ షూట్ కూడా ఈ వర్క్ షాప్ లో భాగంగా చేయనున్నారంట. వర్క్ షాప్ కంప్లీట్ అయిన తర్వాత సినిమా షూటింగ్ ప్రారంభిస్తారని సమాచారం. ఈ ఏడాదిలో ఆఖరులో లేదంటే వచ్చే ఏడాది ఆరంభంలో జక్కన్న మహేష్ తో సినిమాని సెట్స్ పైకి తీసుకొని వెళ్లనున్నారు. ఈ సినిమాకి సంబంధించి క్యాస్టింగ్ ని ఫైనల్ చేసే పనిలో ప్రస్తుతం జక్కన్న ఉన్నారని ప్రచారం నడుస్తోంది. ఇండోనేషియాకి చెందిన బ్యూటీని మహేష్ బాబుకి జోడీగా ఇప్పటికే ఖరారు చేశారని టాక్. అలాగే కొంతమంది హాలీవుడ్ స్టార్స్ ని కూడా ఈ సినిమాలో కీలక పాత్ర కోసం ఎంపిక చేయనున్నారని తెలుస్తోంది. ఏది ఏమైనా జక్కన్న, మహేష్ సినిమా మాత్రం ఈ సారి హాలీవుడ్ లో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఆర్ఆర్ఆర్ తోనే జక్కన్న హాలీవుడ్ టెక్నీషియన్స్ ని, జేమ్స్ కామెరూన్, స్టీవ్ స్పిల్ బర్గ్ లాంటి స్టార్ దర్శకులని మెప్పించారు. నాటునాటు సాంగ్ కి ఆస్కార్ కూడా అందుకున్నారు. ఇప్పుడు మహేష్ బాబు మూవీతో ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తారనేది చూడాలి.

